సాక్షి అనకాపల్లి

ఆదివారం । 1 । జూన్ । 2025



విశాఖ బీచ్‌లో భారీ జాతీయ జెండాతో ఎన్‌సీసీ విద్యార్థుల ప్రదర్శన

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డాక్టర్ బాలాజీ

అనకాపల్లి: జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారిగా డాక్టర్ బాలాజీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత డీఎంహెచ్‌వో (ఇన్‌చార్జి) డాక్టర్ ఎం.శాంతిప్రభ ఉద్యోగ విరమణ చేయడంతో బాలాజీకి బాధ్యతలు అప్పగించారు.

సబ్ జైలులో సౌకర్యాలపై ఆరా

- నిందితులతో మాట్లాడిన న్యాయమూర్తి


సబ్ జైల్లో సౌకర్యాలపై ఆరా తీసున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు

అనకాపల్లి టౌన్: స్థానిక సబ్ జైల్లో నిందితులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవ అధికారి ధర్మారావు ఆరా తీశారు. పదో అదనపు జిల్లా జడ్జి నరేష్ ఆదేశాల మేరకు సాధారణ పరిశీలనలో భాగంగా సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి నిందితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్య సమస్యలు ఉంటే డాక్టర్‌కు చూపించాలని జైలు అధికారులను ఆదేశించారు. బెయిల్ కోసం న్యాయ సహాయకులను ఉపయోగించుకోవాలని సూచించారు. జైల్ సూపరింటెండెంట్ కిరణ్, న్యాయ సహాయకులు తులసి, సాయిరాం, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా సత్యనారాయణ


చైర్మన్‌గా నియమితులైన సత్యనారాయణను అభినందిస్తున్న సీజీఆర్ఎఫ్ సభ్యులు

మహారాణిపేట: ఎలక్ట్రిసిటీ కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) చైర్మన్‌గా బి.సత్యనారాయణ రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ఈపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. శనివారం సత్యనారాయణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. 2022 నుంచి 2025 వరకు సత్యనారాయణ సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా సేవలందించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని వివిధ న్యాయస్థానాల్లో 1998 నుంచి 2022 వరకు పలు హోదాల్లో న్యాయమూర్తిగా పనిచేశారు. 2022లో జిల్లా జడ్జిగా పదవీ విరమణ పొందారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో తీర్పులిచ్చారు. కాగా సత్యనారాయణ పునర్నియామకం పట్ల రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, ఏపీ ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.హరిబాబు(ఫైనాన్స్), సీజీఆర్ఎఫ్ సభ్యులు ఎ.మురళీకృష్ణ (ఇండిపెండెంట్), ఎస్.సుబ్బారావు (ఫైనాన్స్), బి.సులేఖరాణి (టెక్నికల్) హర్షం ప్రకటించారు.

స్పాట్ వాల్యుయేషన్ నుంచి మినహాయించాలి

- డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు యూటీఎఫ్ వినతి


డీఈవో అప్పారావునాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న చిన్నబ్బాయ్

అనకాపల్లి : ప్రభుత్వ నిబంధనల ప్రకారం కచ్చితంగా బదిలీ అయ్యే అవకాశమున్న స్కూల్ అసిస్టెంట్లను సప్లిమెంటరీ స్పాట్ వాల్యుయేషన్ నుంచి మినహాయించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ కోరారు. జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాకలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడుకు శనివారం ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 31, జూన్ 1, 2వ తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లు బదిలీ వెబ్ ఆప్షన్ ఇచ్చుకునే పనిలో ఉన్నారని, వారందరికీ మినహాయింపు ఇవ్వాలని, లేని పక్షంలో స్పాట్ వాల్యుయేషన్‌ను రీ షెడ్యూల్ చేయాలని కోరారు. ఒక వైపు ప్రభుత్వమే బదిలీల షెడ్యూల్‌ని ప్రకటించి అవే రోజుల్లో పేపర్లను మూల్యాంకనం చేయాలని చెప్పడం సరికాదన్నారు. పేపర్లు దిద్దడానికి రాని ఉపాధ్యాయులపై చర్యలు ఉంటాయని అధికారులు చెప్పడంతో భయపడుతున్నారని వాపోయారు.



పేరు అబద్ధం కబ్జా నిజం!

దళితులకు చెందిన 103 ఎకరాలను కాజేసిన టీడీపీ నేత

- భూముల విలువ రూ. 50 కోట్ల పైమాటే!
- పంట నష్టపరిహారం, బీమా సైతం కాజేత
- ప్రశ్నిస్తే హోం మంత్రి పేరుతో బెదిరింపులు

దళిత వర్గానికి చెందిన మహిళ మంత్రిగా ఉన్నప్పటికీ దళితుల భూములకు రక్షణ కరువైంది. ఆమె అనుచరుడే భూములను ఆక్రమించి దళిత రైతులపై తప్పుడు కేసులు బనాయించడం విస్మయపరుస్తోంది. హోంమంత్రి అనిత ముఖ్య అనుచరుడు సుమారు రూ.50 కోట్ల విలువైన 103 ఎకరాలను కబ్జా చేశాడు.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

పేరులోనే కాదు అక్రమ వ్యవహారాల్లోనూ ఓ టీడీపీ నేత సార్థక నామధేయుడిసని నిరూపించుకున్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరం మండలం టీడీపీ నేత అమలకంటి అబద్ధం హోంమంత్రి అనితకు ముఖ్య అనుచరుడు. దళిత వర్గానికి చెందిన అనిత హోంమంత్రిగా ఉన్నప్పటికీ ఆమె అనుచరుడు మాత్రం నిరుపేద దళితుల భూములను ఆక్రమించి దర్జాగా సాగు చేసుకోవడం గమనార్హం. తమ తాతలు, తండ్రుల కాలం నుంచి సాగు చేసుకుంటున్న డీ పట్టా భూములను ఆక్వా సాగు పేరుతో లీజుకు తీసుకుని అనిత ముఖ్య అనుచరుడు కాజేశారని బాధితులు వాపోతున్నారు. రూ.50 కోట్ల విలువ చేసే 103 ఎకరాల భూముల రికార్డులను విశాఖ ఆక్వాఫారానికి చెందిన జగన్మోహన్‌రావుతో కలిసి మార్పు చేసి తనవరం చేసుకున్నట్లు పేర్కొంటున్నారు. తమ భూములను తమకివ్వాలని కోరితే కేసులు నమోదు చేయించి స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారని ఆక్రోశిస్తున్నారు. మరో వైపు ఈ భూముల రికార్డులన్నీ తారుమారు చేసి... పంట నష్టపరిహారంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీలు పొందుతుండటం గమనార్హం.

ఆక్వా సాగు పేరుతో..

ఎస్.రాయవరం మండలం వాకపాడు రెవెన్యూ పరిధిలోని 73, 74, 75, 77, 78, 344, 345, 346, 347, 348, 351, 352, 353, 354, 435, 438, 439, 441, 442, 443, 445 సర్వే నంబర్లలో సుమారు 103 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ప్రభుత్వం వీటిని సుమారు 30 ఏళ్ల క్రితం తంతట సూర్యారావు (పట్టానెం 41/98), దండా కొండయ్య (42/98), పెయ్యిల నాగరాజు (43/98), గారా నర్సింహులు, జల్లూరి అప్పారావు, దండా త్రిమూర్తులు, దండా అప్పన్న, దండా తాతబ్బాయి, గారా అప్పయ్యమ్మ, బీరా నాగన్న, గారా అప్పారావు, కొప్పిశెట్టి మాణిక్యం, కొప్పిశెట్టి అప్పారావు, కొప్పిశెట్టి అయ్యన్న తదితర స్థానిక పేద రైతుల పేరుతో డీ-ఫారం పట్టాలు మంజూరు చేసింది. అప్పటినుంచి వీరంతా ఈ భూములను సాగుచేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ భూములపై కన్నేసిన టీడీపీ నేత 'అబద్ధం'.. తనకు లీజుకు ఇస్తే ఆక్వా లాభాల్లో వాటా ఇస్తానని నమ్మబలికి పదేళ్ల క్రితం వారి నుంచి తీసుకున్నాడు. ఎమ్మెల్యే అనిత అండదండలతో 2014లో ఈ భూమిని 42 సబ్ డివిజన్లుగా విభజించి.. ఈ ప్రాంతానికి సంబంధం లేని విశాఖ ఆక్వాఫారానికి చెందిన జగన్మోహన్‌రావు తండ్రి వీరభద్రరావును తెరమీదకు తీసుకు వచ్చి అతని పేరున మ్యూటేషన్ (వెబ్‌ల్యాండ్‌లో) చేశారు. ఈ 42 సబ్ డివిజన్‌లకు 42 ఖాతా నెంబర్లు ఇచ్చారు. ఈ భూముల్లో ఆక్వా కాకుండా వరి సాగు చేస్తున్నాడు. తమ భూములకు లీజు చెల్లించాలని లేదంటే వెనక్కి ఇవ్వాలని కోరిన రైతులను బెదిరిస్తూ హోంమంత్రి సహకారంతో పోలీసు కేసులు పెట్టి వేధిస్తున్నాడు.

సాగు చేస్తూ.. నష్టపరిహారం తీసుకుంటూ..

సదరు టీడీపీ నేత పదేళ్లుగా ఈ భూముల్లో ఏటా 3 వేల బస్తాల ధాన్యం పండిస్తూ.. తమకు ఒక్క గింజ కూడా ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా రైతుల నుంచి అక్రమంగా లాక్కున్న భూముల్లో సాగుచేస్తున్న పంటలకు నష్టం వాటిల్లిందంటూ తన పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వం నుంచి తాను, తన కుటుంబ సభ్యుల పేరుతో ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారాన్ని పొందారు. దళితులకు చెందిన ఈ భూములు ఉన్న ప్రాంతాలకు పక్కనే ఆక్వా సాగు జరుగుతోంది. దీంతో ఈ భూములకు మార్కెట్‌లో ధర కూడా బాగానే ఉంది. 103 ఎకరాల భూములకు రూ.50 కోట్ల మేరకు విలువ ఉంటుందని తెలుస్తోంది. తమ భూములు తమకివ్వాలంటూ పలుమార్లు కోరినా అధికారులు కూడా పట్టించుకోవడం లేదని బాధిత రైతులు వాపోతున్నారు.


రైతులకు డీ పట్టా ఇచ్చినట్లు తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులు


ఆక్వా ఫారం జగన్మోహన్ రావు పేరుతో ఆర్‌వోఆర్‌లో మార్పులు చేసిన రికార్డు పత్రం


అబద్ధం పేరుతో పంట నష్టం పరిహారం కోసం తయారు చేసిన నివేదిక


మోసగించి కాజేశారు..



ఈ భూములను సాగు చేసుకునేందుకు మా పూర్వీకులకు ప్రభుత్వం పట్టా ఇచ్చింది. వెంకటాపురం గ్రామానికి చెందిన 'అబద్ధం' అనే టీడీపీ నాయకుడు, జగన్మోహన్‌రావు అనే వ్యక్తి మమ్మల్ని మోసం చేసి భూములను లాక్కున్నారు. ఒక్క పైసా లీజు ఇవ్వకపోగా పోలీసు కేసులు పెట్టి వేధిస్తున్నారు. వారి ఆగడాలకు తట్టుకోలేక ఏం చేయాలో తోచక భయంతో జీవిస్తున్నాం. మా దగ్గర పట్టాలు ఉన్నాయి.

–తంతట సూర్యారావు, వెంకటాపురం, ఎస్.రాయవరం మండలం

పట్టాలున్నాయి..



ప్రభుత్వం మా పూర్వీకులకు ఇచ్చిన భూములను అబద్ధం అనే టీడీపీ నాయకుడు ఆక్రమించుకున్నాడు. రాజకీయ పలుకుబడి ఉపయోగించి మమ్మల్ని భూముల్లోకి రానివ్వకుండా బెదిరిస్తున్నారు. కేసులు బనాయిస్తున్నారు. మా దగ్గర పట్టాలు ఉన్నాయి.

– పెయ్యిల నాగరాజు, వాకపాడు

ఇద్దరూ కలిసి కబ్జా



మా తాత, తండ్రులకు డీ-ఫారం పట్టాలు ఇచ్చారు. ఈ భూముల్లో గంటి, జొన్న సాగు చేసే వాళ్లం. పెట్టుబడులు పెట్టలేక ఆకుల జగన్మోహన్‌రావు అనే వ్యక్తికి లీజుకు ఇస్తే టీడీపీ నాయకుడు అబద్ధంతో కలిసి కబ్జా చేశారు. మా భూములు మాకు అప్పగించాలని కోరితే కేసులు పెట్టి వేధిస్తున్నాడు. మావద్ద ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఉన్నాయి.

– దండా తాతబ్బాయి, వాకపాడు, ఎస్.రాయవరం మండలం


భూములు చూపిస్తున్న రైతు

మా భూములు మాకు అప్పగించాలి

మాకు ఈ భూములు మినహా వేరే ఆధారం లేదు. వయసు పైబడటంతో కష్టంగా ఉంది. అబద్ధం అనే నాయకుడు మా భూములు ఆక్రమించి సాగుచేస్తున్నాడు. మా భూములు మాకు అప్పగించి న్యాయం చేయాలి.

–దండా మాణిక్యం, వాకపాడు

ఏడాదంతా రెడ్‌బుక్ పాలన

- సూపర్ 6 పథకాలు ఎక్కడ?
- కూటమి ప్రభుత్వం చేసిన అన్యాయాలు, అక్రమాలపై నిరసన
- 4న వెన్నుపోటు దినం
- పోస్టర్ విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కరణం ధర్మశ్రీ, బూడి ముత్యాలనాయుడు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజు, కంబాల జోగులు, శోభా హైమావతి, బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏడాది పూర్తి అవుతున్నా నేటికీ అమలు చేయకపోవడంతో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4వ వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కార్యాలయంలో శనివారం వెన్నుపోటు దినం పోస్టర్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాదిలో చేసిన మోసాలు, అరాచకాలపై నిరసన కార్యక్రమం చేపడతామని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చి ఈ ఏడాది కాలంలో రెడ్‌బుక్ పాలన సాగించిందన్నారు. నిరుద్యోగులకు 7 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు, మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుకు ఏడాదికి రూ.20 వేలు, మహిళలకు ఉచిత బస్, 18 నుంచి 50 సంవత్సరాల మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని హామీలిచ్చి, ఏదీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1200 మంది వైఎస్సార్‌సీపీ నాయకులపై, సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేశారని ధ్వజమెత్తారు. వీటన్నింటినీ ప్రజల దృష్టికి తేవడానికి ఈ నెల 4వ తేదీన నియోజకవర్గంలో సుమారు 2వేల మందితో నిరసన కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజు, కంబాల జోగులు, పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లోచల సుజాత, అరకు పార్లమెంట్ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, 80, 83వ వార్డు ఇన్‌చార్జ్‌లు కెఎం.నాయుడు, జాజుల రమేష్, మండలపార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, కశింకోట మండల పార్టీ అధ్యక్షుడు మలసాల కిషోర్, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, లక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ డిపోల్లో సరకుల పంపిణీ

- 2న అల్లూరి పార్క్ వద్ద యోగా ప్రదర్శన
- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల : జిల్లాలో ఆదివారం నుంచి నిత్యావసర సరుకులను చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని కలెక్టర్ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై సమీక్షించారు. జిల్లాలో 1,069 చౌక ధరల దుకాణాల ద్వారా సరుకులు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, అన్ని దుకాణాల ద్వారా సరుకులు సక్రమంగా పంపిణీ జరిగేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. జూన్ 1 నుండి 15 తేదీలోగా కుటుంబంలోని ఎవరైనా వెళ్లి సరుకులు పొందవచ్చునన్నారు. చౌక ధరల దుకాణాలు ఉదయం 8 నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 4 నుండి 8 గంటల వరకు పనిచేస్తాయని అన్నారు. 65 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రతి నెలా 5 వరకు మధ్యాహ్నం 12 నుండి 4 గంటల సమయంలో వారి ఇంటి వద్దకే సరుకులు అందజేయడం జరుగుతుందన్నారు.

యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా జూన్ 2న నర్సీపట్నం నియోజకవర్గం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట పర్యాటక ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు పార్క్ వద్ద వేయి మందితో జిల్లా స్థాయి యోగా ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా గణాంకాధికారి జి.రామారావు, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.లావణ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.మనోరమ, నియోజకవర్గ, మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రక్తసిక్తం.. భయానకం

- స్పీకర్ ఇలాకాలో హత్యా రాజకీయాలు
- వైఎస్సార్‌సీపీ దళిత నేతపై కత్తులతో దాడి
- రౌడీ షీటర్ పప్పల అప్పలనాయుడు ఘాతుకం
- ఆరుగురితో కలిసి హత్యాయత్నం
- వెంటపడి దాడి చేస్తూ వీడియో చిత్రీకరణ
- రౌడీ షీటర్ అయ్యన్న కుటుంబానికి సన్నిహితుడు, టీడీపీ కార్యకర్త


ఈశ్వరరావును పరామర్శిస్తున్న పార్టీ నాయకులు


వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వరరావు, (ఇన్‌సెట్) రక్తసిక్తమైన చేయి

విశాఖపట్నం: నర్సీపట్నం రక్తసిక్తమయింది.. రాత్రి పూట కత్తులు చేతపట్టి వెంటపడి దాడి చేయడంతో భయానక వాతావరణం నెలకొంది.. పైశాచికానందంతో వీడియో తీస్తూ, వికటాట్టహాసం చేస్తూ, 'మా మామయ్య మధుని (కౌన్సిలర్ మధు) తిడతావా' అని ఓ రౌడీ షీటర్ రంకెలేయడం నర్సీపట్నంలో అదుపు తప్పిన శాంతిభద్రతలకు తార్కాణంగా నిలిచింది. నిందితుడు అప్పలనాయుడు టీడీపీ కార్యకర్త. స్పీకర్ అయ్యన్నపాత్రుడి కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. ఆయన మరో ఆరుగురితో కలిసి వైఎస్సార్‌సీపీ నర్సీపట్నం యూత్ అధ్యక్షుడు, దళిత యువకుడు అల్లంపల్లి ఈశ్వరరావుపై శనివారం రాత్రి హత్యాయత్నానికి పాల్పడడం కలకలం సృష్టించింది. బలిఘట్టం నుంచి టిఫిన్ తీసుకువెళ్లేందుకు నర్సీపట్నం పాల్‌ఘాట్ సెంటర్‌కు వచ్చిన ఈశ్వరరావుపై పప్పల అప్పలనాయుడు బృందం రెండు బైక్‌లపై వచ్చి దాడికి దిగారు. సినీ ఫక్కీలో వీడియో తీస్తూ వెంటపడి కత్తులతో దాడి చేశారు. ప్రాణభయంతో పాల్‌ఘాట్ సెంటర్ నుంచి అబిద్ సెంటర్‌కు ఈశ్వరరావు పరుగులు తీశారు. మెయిన్ రోడ్డులో ఉన్న షాపులో దాక్కుంటే బయటకు లాక్కుని వచ్చి మరింత దారుణంగా కొట్టి చంపేందుకు కత్తులు తీశారు. ఈశ్వరరావు వారిని విదిలించుకుని మళ్లీ పరుగులు తీసి అంబేడ్కర్ విగ్రహం వద్ద దాక్కున్నారు. సమాచారం అందుకున్న మొబైల్ కానిస్టేబుల్ హుటాహుటిన వచ్చి ఈశ్వరరావును కాపాడారు. కానిస్టేబుల్ ఆయనను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చేర్చారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు తమరాన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ, ఈశ్వరరావు అనుచరులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున ఏరియా ఆస్పత్రికి చేరుకున్నారు. సీఐ గోవిందరావు, ఎస్సై ఉమామహేశ్వరరావు సంఘటన వివరాలను ఈశ్వరరావును అడిగి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. రౌడీ షీటర్ పప్పల అప్పలనాయుడు కొద్ది కాలం క్రితం బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కర్రి శ్రీనివాసరావుపై హత్యా యత్నానికి పాల్పడినప్పుడు పోలీసులు కఠినంగా వ్యవహరించి ఉంటే ఈ సంఘటన జరిగి ఉండేది కాదని బాధితుడిని పరామర్శించేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు వ్యాఖ్యానించారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం


ఉద్దండపురంలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి అనిత


కశింకోటలో వృద్ధురాలి యోగక్షేమాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయ కృష్ణన్

కశింకోట/నక్కపల్లి: సామాజిక పింఛన్ల పంపిణీని హోం మంత్రి నక్కపల్లి మండలం ఉద్దండపురంలో, కలెక్టర్ కశింకోటలో శనివారం ప్రారంభించారు. హోం మంత్రి వంగలపూడి అనిత ఉద్దండపురంలో మాట్లాడుతూ ఒకటో తేదీ ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగానే శనివారం నుంచి పింఛన్లు అందజేస్తున్నామని చెప్పారు. మంత్రి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందించారు. వారి ఇంట్లో స్వయంగా టీ తయారు చేసి అందరికీ ఇచ్చారు. కలెక్టర్ విజయ కృష్ణన్ కశింకోటలోని గవరపేటలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నడవడానికి సహకరించక మంచానికే చాలా కాలంగా పరిమితమై ఉన్న తనకు వితంతు పింఛన్ స్థానంలో వికలాంగ పింఛన్ అందివ్వడానికి చర్యలు తీసుకోవాలని బాధితురాలు సూరిశెట్టి లక్ష్మీమణి విన్నవించారు. అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, మండల ప్రత్యేక అధికారి సుభాషిణి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా రోడ్డు నిర్మాణం

కలెక్టర్ విజయ కృష్ణన్



ఏపీఐఐసీ భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

మాకవరపాలెం: ఏపీఐఐసీ భూమిలో పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా యలమంచిలి నియోజకవర్గంలో పెదపల్లికి నూతనంగా రోడ్డు నిర్మించనున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. మండలంలోని రాచపల్లి ప్రాంతంలో 17 ఏళ్ల కిత్రం ఆన్‌రాక్ రిఫైనరీ నిర్మాణం కోసం అప్పట్లో 2,400 ఎకరాల భూమిని సేకరించిన సంగతి తెలిసిందే. ఇక్కడ మిగిలిన మరో 309 ఎకరాల భూమిని నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణతో కలసి కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీఐఐసీ ఆధీనంలో ఉన్న భూమిని పరిశ్రమల స్థాపనకు కేటాయించనున్నట్టు చెప్పారు. అందుకు వీలుగా రోడ్డు సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా రామన్నపాలెం జంక్షన్ నుంచి యరకన్నపాలెం మీదుగా యలమంచిలి నియోజకవర్గంలోని పెదపల్లి వద్ద హైవేను కలుపుతూ 40 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తామన్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చామని, నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

తల్లీ కొడుకులు అదృశ్యం

యలమంచిలి రూరల్: పట్టణంలోని రాంనగర్‌కు చెందిన యాదగిరి లక్ష్మణరావు భార్య సాయిలక్ష్మి, ఆరేళ్ల కుమారుడు రిషివర్ధన్ బుధవారం నుంచి కనిపించడం లేదని పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. తాను డ్యూటీకి వెళ్లి, ఇంటికి వచ్చే సరికి తన భార్య, కుమారుడు కనిపించలేదని, చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదని భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. మే 28న తాను విధులకు వెళ్లిన తర్వాత ఉదయం తొమ్మిదిన్నర గంటలకు బ్యాగు పట్టుకుని కుమారుడితో సహా వెళ్లిపోయినట్టు చుట్టుపక్కల వారు చెప్పారని భర్త పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్సై కె.సావిత్రి మీడియాకు తెలిపారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED
PRE-PRIMARY : Mother Teacher
MIDDLE & HIGH SCHOOL : Social Studies, PET & OFFICE ASSISTANT
Interested candidates may walk in interview only on school working days from 9.00 am to 4.00 pm
Send your resumes to mail id: ramakrishnaschool@yahoo.com
RAMAKRISHNA SCHOOL
NAD KOTHA ROAD, VIZAG-27
9848532315

WE ARE HIRING for the following POSITIONS
KINDERGARTEN TEACHERS: (Montessori Trained)
GRADE TEACHERS - Grade I to III
SUBJECT TEACHERS - GRADE IV TO VII
COMPUTER FACULTY
QUALIFICATIONS: Graduation/ PG. with B.Ed/D.Ed/Equalant
2 to 3 years Experienced Teachers would be preferred
Walk-in: Date: 02-06-2025 & For more details contact
PRAKRUTI SCHOOL
Near Bank Colony, KV BHOOMULU, BHEEMUNIPATNAM.
PH: 949 22 173 22/833 20 844 69

ఏడాది పాలనంతా మోసాలే

- ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- పార్టీలో కార్యకర్తలకు సముచిత స్థానం
- అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంటు పరిశీలకురాలు శోభా హైమావతి



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న పార్లమెంట్ సమన్వయకర్త ధర్మశ్రీ

నక్కపల్లి/ఎస్.రాయవరం: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనంతా మోసాలు, కక్షసాధింపులకే సరిపోయిందని అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకురాలు శోభాహైమావతి, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ విమర్శించారు. శనివారం అడ్డురోడ్డులో పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది పాలనలో ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. సూపర్‌సిక్స్ హామీలన్నీ సూపర్ మోసాలని తేలిపోయిందన్నారు. రూ.4 వేలకు పింఛను పెంచామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి సర్కారు గత ప్రభుత్వ హయాంలోనే రూ.3 వేలు చెల్లించిన విషయం మర్చిపోయారన్నారు. వీటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు లిక్కర్ స్కాములు, ప్రతిపక్ష పార్టీ నేతలపై అక్రమంగా కేసులు బనాయించడం వంటివి చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి వారం రూ.3 వేల కోట్లు రుణాలు తెస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారన్నారు. ఏడాదిలోనే రూ.లక్ష కోట్ల అప్పులు తెచ్చేశారన్నారు. కూటమి ఏడాది పాలనను ఎండగడుతూ మండల కేంద్రాల్లో ఈ నెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినాన్ని ప్రతి కార్యకర్త విజయవంతం చేయాలని కోరారు. ఐదేళ్ల పాలనలో కార్యకర్తలను విస్మరించిన విషయాన్ని జగనన్న గుర్తించారన్నారు. రాబోయే రోజుల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తారన్నారు. 2029 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని మట్టికరిపించి వైఎస్సార్‌సీపీ తిరిగి విజయకేతనం ఎగుర వేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చాక కార్యకర్తలను ఏ స్థాయిలో గౌరవించాలో జగనన్న దిశానిర్దేశం చేశారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం వల్ల నష్టపోయిన ప్రతి కార్యకర్త బాధను అర్థం చేసుకుంటున్నామని, సమయం వచ్చినప్పుడు తగిన రీతిలో గుణపాఠం చెప్తామన్నారు. ఈ రోజు మీది కావచ్చు, మాకంటూ ఒక రోజు వస్తుందని కూటమి నేతలను హెచ్చరించారు. ఏడాది పాలనలో చెప్పుకోవడానికి ఏమీ లేక మహానాడులో జగనన్నను విమర్శించడమే పనిగా పెట్టుకుని తీర్మానాలు చేశారని ఎద్దేవా చేశారు. కడప గడ్డపై మహానాడు అట్టర్‌ఫ్లాప్ అయిందన్నారు. సమన్వయకర్త కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఏడాదిలోపే వచ్చేసిందని, దీన్ని మనం ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే చాలన్నారు. కార్యక్రమంలో ఎస్.రాయవరం జెడ్పీటీసీ కాకర దేవి, ఎంపీపీ పార్వతి తాతారావు, పాయకరావుపేట, నక్కపల్లి మండలాల అధ్యక్షులు చిక్కాల రామారావు, శీరం నర్సింహమూర్తి, బీసీ విభాగం జిల్లా నాయకులు పైలా రమేష్, కొణతాల శ్రీను, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, ధనిశెట్టి బాబూరావు, జిల్లా మహిళా నాయకురాలు లోచల సుజాత, మధువర్మ, రాజేష్ ఖన్నా, జగతా శ్రీను, డి. సాయిబాబా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బురద రోడ్డులో గిరిజనుల ఆందోళన

రోడ్ల పనుల బకాయి బిల్లులను చెల్లించాలని డిమాండ్



బురద రోడ్డులో వాలాబు గిరిజనులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేత వెంకన్న

దేవరాపల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల బకాయి బిల్లులను తక్షణమే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. వాలాబు, చింతలపూడిలో పంచాయతీల్లో అసంపూర్తిగా నిలిచిన రోడ్డు, కాజ్‌వే నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. వాలాబు పంచాయతీలో స్థానిక గిరిజనులతో కలిసి అసంపూర్తిగా నిలిచిపోయి బురదమయంగా మారిన రోడ్డులో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ వాలాబు పంచాయతీలో రూ. 12 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేపడితే రూ.40 లక్షలు మాత్రమే నిధులు మంజూరు చేశారని వాపోయారు. చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేటలో రోడ్డు నిర్మాణానికి రూ. 84 లక్షలు మంజూరు చేయగా, ఎర్త్ వర్క్ చేసి పనులు నిలుపుదల చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని విమర్శించారు. అనకాపల్లి జిల్లాలో 166 కిలోమీటర్ల పొడవున 1,354 రోడ్లు నిర్మాణం పనులు పూర్తి కాగా వీటికి కాంట్రాక్టర్లు రూ. 143 కోట్లు ఖర్చు చేస్తే రూ. 11 కోట్లు మాత్రమే బిల్లులు చెల్లించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె పండుగ పేరిట 1,734 రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేయగా, ఫిబ్రవరి నాటికి పూర్తి చేసిన 1,354 రోడ్లుకు సంబంధించి రూ. 143 కోట్లు విడుదల చేయాలని అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేస్తే, రూ.11 కోట్లు మాత్రమే మంజూరు చేశారన్నారు. ఇప్పటికైనా పెండింగ్ పనులు పూర్తి చేసి, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో టి.శంకర్, పి.భీమన్న, సిహెచ్. రాంబాబు, కె.పైడితల్లి, కె.సుదర్శన్, డి.నూకాలు, డి. దేముడు, ఎరకన్న తదితర గిరిజనులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



ప్రగడ సీత

అనకాపల్లి టౌన్: బవులువాడ దర్జీనగర్‌లో నివాసముంటున్న ప్రగడ సీత (60) అదృశ్యమైంది. రూరల్ ఎస్ఐ రవికుమార్ అందించిన వివరాలు.. పిఠాపురంలో తన భర్తతో నివాసముంటూ ఆరు నెలల క్రితం మనస్పర్థల వలన దర్జీనగర్‌లో ఉన్న కూతురి వద్దకు ఆమె వచ్చింది. అప్పటి నుంచి ఇక్కడే ఉంటూ గురువారం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోవడంతో వృద్ధురాలి మనుమడు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.17.88 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: సంపత్ వినాయగర్ ఆలయ హుండీ ఆదాయం శనివారం లెక్కించారు. 24 రోజులకు గాను రూ.17,88,049 నగదుతో పాటు 2.300 మిల్లీ గ్రాముల బంగారం, 125 గ్రాముల వెండి, యూఏఈ, మలేషియా, శ్రీలంక ఇతర దేశాల కరెన్సీ లభించింది. కార్యక్రమంలో సహాయ కమిషనర్, ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు, ఆలయ వ్యవస్థాపక సభ్యుడు టీఆర్ చోళన్, దేవదాయ శాఖ తనిఖీదారు ఎం.శ్రీధర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఐఐఎంవీలో 'ఈపీజీడీపీఎం' ప్రారంభం



మాట్లాడుతున్న హిందూస్థాన్ షిప్‌యార్డు విశ్రాంత సీఎండీ హేమంత్ ఖత్రి

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలోని ఐఐఎం విశాఖపట్నం(ఐఐఎంవీ)లో రక్షణ రంగ అధికారులు, కార్యనిర్వాహకుల కోసం ఏడాది పాటు నిర్వహించే 'ఎగ్జిక్యూటివ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (ఈపీజీడీపీఎం)' శనివారం ప్రారంభమైంది. హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ విశ్రాంత సీఎండీ హేమంత్ ఖత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిజిటల్ మౌలిక వసతులు, వందే భారత్ వంటి ఆవిష్కరణలు, 6జీ టెక్నాలజీ వైపు సాగుతున్న ప్రయాణంలో దేశ నాయకత్వ పాత్రను కొనియాడారు. ఐఐఎంవీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ డైనమిక్, టెక్నాలజీ ఆధారిత ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా రక్షణ సిబ్బందిని సిద్ధం చేయడానికి ఈ కోర్సును రూపొందించినట్లు చెప్పారు. అడ్మిషన్స్ చైర్ ప్రొఫెసర్ ప్రశాంత్ ప్రేమ్‌కుమార్ నాయర్ మాట్లాడుతూ ఈ బ్యాచ్‌లో సగటు వయసు 38 సంవత్సరాలు కాగా.. 13 సంవత్సరాల పని అనుభవం కలిగిన వారు దేశంలోని వివిధ ప్రాంతాల్లో రక్షణ రంగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ప్రోగ్రాం చైర్ ప్రొఫెసర్ బి.శ్రీరంగాచార్యులు మాట్లాడుతూ ఈ కోర్సు మాడ్యులర్ ఎంబీఏగా హైబ్రిడ్ ఫార్మాట్‌లో రూపొందించినట్లు చెప్పారు. డీన్ కావేరీ కృష్ణన్ మాట్లాడారు.

క్రీడలకు కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దాలి



జ్యోతి వెలిగించి టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఉషశ్రీ, తదితరులు

ఎంవీపీకాలనీ: ఎస్ 3 స్పోర్ట్స్ ఏరీనాలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 400 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఇండియన్ ఆయిల్ విశాఖ డివిజన్ హెడ్ బుచ్చయ్య, సీనియర్ మేనేజర్ చైతన్య, క్రీడాకారిణి, కార్పొరేటర్ ఉషశ్రీ తదితరులు జ్యోతి వెలిగించి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అండర్ 11, 13, 15, 17 ఏళ్ల విభాగాల్లో క్రీడాకారులు పోటీపడుతున్నారు. ఎస్ 3 స్పోర్ట్స్ ఏరీనా నిర్వాహకుడు సహాని పాల్గొన్నారు.

ఏపీఐఐసీ నిర్వాసితులకు రూ.693 కోట్ల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ



నిర్వాసితులతో మాట్లాడుతున్న మంత్రి అనిత, కలెక్టర్ విజయ్ కృష్ణన్ తదితరులు

నక్కపల్లి: మండలంలో పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీకి భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.693 కోట్లు చెల్లించనున్నట్టు హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. శనివారం వారు తహసీల్దార్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన నిర్వాసితులతో మాట్లాడారు. మండలంలో తీరప్రాంతం వెంబడి పలు పరిశ్రమలు రానున్నాయన్నారు. వీటివల్ల లక్షలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కంపెనీల కోసం భూములు ఇచ్చిన రైతులు,నిర్వాసితులకు నష్టపరిహారంతో పాటు, నివాసప్రాంతాలు ఖాళీ చేస్తున్నవారికి ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.693 కోట్లు అందజేస్తున్నామని తెలిపారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు 151 ఎకరాల్లో రూ.209 కోట్లతో లేఅవుట్లు ఏర్పాటు చేసి, మౌలిక సదుపాయాలు కల్పించి, ఐదు సెంట్ల చొప్పున ఇంటి స్థలం పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.8.36 లక్షలు అందజేయనున్నట్టు తెలిపారు. నిర్వాసితుల్లో 289 మంది విద్యావంతులు ఉన్నట్టు గుర్తించామని, వీరందరికీ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఒక్కొక్కరికీ రూ.30 వేలతో నైపుణ్యశిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు, నిర్వాసితులు పరిహారం చెల్లింపుల్లో జరిగిన అన్యాయాన్ని ఈ సమావేశంలో వివరించి, న్యాయం చేయాలని కోరారు. పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి, న్యాయం చేస్తామని మంత్రి, కలెక్టర్ హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో ఆర్‌డీవో వి.వి.రమణ, తహసీల్దార్ నర్సింహమూర్తి పాల్గొన్నారు.

బెల్ట్ షాప్‌పై దాడి

53 మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడితో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

అచ్యుతాపురం రూరల్: మండలంలోని మెలుపాక జగన్నాథపురంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఇక్కడ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకుని, అతడి నుంచి 53 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్రామాన్ని కలెక్టర్ దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. ఉదయం 9 గంటల ప్రాంతంలో మఫ్టీలో ఉన్న అధికారులను గుర్తించని విక్రయదారు వారి ఎదుటే మద్యం అమ్మకాలు చేయడంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 'కలెక్టర్ దత్తత గ్రామంలో బెల్ట్‌షాపు' అనే శీర్షికతో ఇటీవల సాక్షిలో వచ్చిన కథనానికి అధికారుల్లో చలనం లేకపోవడంతో గ్రామస్తులు ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదు మేరకు దాడులు నిర్వహించారు. ఎంజేపురం బెల్ట్ షాపులో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. ఇక్కడ ధర ఎక్కువైనా కొనుగోలు చేస్తున్నారు. దాంతో గ్రామ రైతులు మద్యానికి బానిసై ఏ విధమైన పనులు చేయలేకపోతున్నారని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ శ్రమించిన సొమ్మంతా మద్యం సేవించడానికే సరిపోతుందని, ఇంటికి చిల్లి గవ్వ కూడా ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన విలేకరి అక్కడకి చేరుకుని విషయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తుండగా, మఫ్టీలో ఉన్న అధికారులు అతని మొబైల్ బలవంతంగా లాక్కొని చేతిపై గాయపరిచారు. అంతేకాకుండా మొబైల్‌లో అప్పటి వరకూ తీసిన ఫొటోలు డిలీట్ చేశారు. సదరు అధికారులు విలేకరిపై దురుసుగా ప్రవర్తించడంతో పలు ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అదేవిధంగా రాంబిల్లి, యలమంచిలి పరిధిలో టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ వారు దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు యలమంచిలి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తేజ తెలిపారు.

హాస్టళ్లలో సెల్‌ఫోన్ల చోరీ కేసు ఛేదన

నిందితుడి అరెస్ట్, 12 ఫోన్లు స్వాధీనం



నిందితుల నుంచి రికవరీ చేసిన మొబైల్స్ వివరాలు వెల్లడిస్తున్న ఏడీసీపీ మోహనరావు

తాటిచెట్లపాలెం: ద్వారకానగర్‌లోని హాస్టళ్లలో సెల్‌ఫోన్ల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేసి.. అతని నుంచి 12 సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు క్రైం ఏడీసీపీ మోహనరావు తెలిపారు. ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ద్వారకానగర్‌లోని శ్రీచక్ర బాయ్స్ హాస్టల్‌ను కొవ్వూరి సోమిరెడ్డి నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 7న హాస్టల్‌లో ఉంటున్న గణేష్ అనే విద్యార్థి తన ఫోన్ కనిపించడం లేదని సోమిరెడ్డికి తెలిపాడు. దీంతో ఆయన హాస్టల్‌లో విచారించగా.. మొత్తం ఆరు ఫోన్లు, అదే ప్రాంగణంలోని మరో హాస్టల్‌లో ఐదు ఫోన్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో సోమిరెడ్డి ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ద్వారకా పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. విచారణలో నిందితుడు కనకం దామోదర్‌గా గుర్తించారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు గత నెల 27న అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 12 సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. కనకం దామోదర్‌పై గతంలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సుమారు 20 సెల్‌ఫోన్ దొంగతనం కేసులు నమోదై ఉన్నాయని ఏడీసీపీ తెలిపారు.

హెచ్‌ఎంలుగా బాధ్యతలు.. 24 గంటల్లోనే రిటైర్డ్



అభినందన కార్యక్రమంలో హెచ్‌ఎంలు కోటేశ్వరరావు, మూర్తి

అనకాపల్లి టౌన్: పదోన్నతి పొందిన 24 గంటల్లోనే ఇద్దరు ప్రధానోపాధ్యాయులు పదవీ విరమణ పొందారు. శనివారం వీరిని భీమునిగుమ్మం పాఠశాలలో జరిగిన సన్మాన కార్యక్రమంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడు అభినందించారు. అనకాపల్లి పట్టణం రామాపురం ఎంపీయూపీ స్కూలులో బీ కోటేశ్వరరావు, ఎస్. రాయవరం మండలం కొరుప్రోలు హైస్కూల్‌లో డీఎస్ మూర్తి ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వీరికి అనూహ్యంగా పదోన్నతులు కల్పిస్తూ విద్యా శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ మేరకు కోటేశ్వరావుకు ఎస్ రాయవరం మండలం ధర్మవరం అగ్రహారం, డీఎస్ మూర్తికి రేవుపోలవరం జెడ్పీ హైస్కూళ్లలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి రావడంతో వారిద్దరూ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అయితే విచిత్రంగా 24 గంటల్లోనే పదవీ కాలం పూర్తి కావడంతో ఒక రోజు హెచ్‌ఎంలుగా మిగిలి పోయారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

Affiliated to Dr. NTR UHS, APSAHP Council & Inter Boards
పారా మెడికల్ డైరెక్ట్ అడ్మిషన్లు
DDR COLLEGE VISAKHAPATNAM
Best Job Guaranteed Bachelor & Diploma Courses
- MPHW/GNM
- DMLT/BSC MLT
- D.ANASTESIA/DIALYSIS
- D.CATHLAB
- PHYSIOTHERAPY
✓30 Years old campus ✓100% Thery and Practicals ✓Parcticals @ KGH ✓100% Placements ✓Best College in Vizag
Website : ddrgroupinstitutions.com
8919624744, 9885194049

Real Estate

BUILDING CONSTRUCTION
■ Premium Quality Constructions for Duplex, Villas, Individual Houses & Appartments with Modern Interiors. Ph : 96767 62671 [SCA25003563]

BUILDING FOR SALE
■ గాజువాక శ్రీనగర్‌లో శ్రీ రాఘవేంద్ర స్కూల్ దగ్గర 390 చ॥గ॥ల విస్తీర్ణంలో నిర్మించిన G+1 రెసిడెన్షియల్ బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ఫోన్ : 93483 52555. [V- 780493]

FOR SALE
■ Brand new 2 Bedroom Apt Excellent Location - Opposite to Cricket stadium, adj to Reliance Shopping West facing 1050 SFT - Garudadri Hills, Madhurawada Contact Ph: +91 97010 23589 [WB-8010]

FLAT FOR SALE
■ 1380 Sft., 3 BHK Flat for Sale. Happy homes, Venkatadri Block, 3rd Floor, E/F at Kancharapalem. Opp. Old ITI Junction, NH-5, Fully Furnished, 7 Years Old. Ph: 73828 36905 [V- 6733]
■ 1200 Sft. East Facing New Flat for Sale at Pothinamallayyapalem. Ph : 86390 45966 [V- 2814]
■ 2BHK-1050 Sq.ft. Newly Built East Facing Flats for Sale. Near Marvel School, Bhanoji Thota, Gajuwaka, Vizag. Ph: 92345 79736 [SCA25003272]
■ 2 BHK, 855 Sft. G/F, E/F 16L, దేశపాత్రుని పాలెం, స్టీల్ ప్లాంట్ & 275 గజాల రేకుల షెడ్ రాంబిల్లి, వెల్లురు గ్రామం, Sq. 3,000/- ఫోన్ : 95023 19697, 92901 82994 [V- 13881]
■ చినముషిడివాడ - శారదాపీఠం దరి 287 చ॥గ॥ N/F G+4 ఫ్లోర్స్, 3 BHK, 1800 Sft. ఫ్లోర్ వైజ్ డీలక్స్ ఫ్లాట్స్ Sft. ధర 3,000/- రూ॥లు & ఇండివిడ్యువల్ ఇల్లులు సేల్. ఫోన్ : 93987 12347 [V- 0049]

FLATS FOR SALE
GATED COMMUNITY
2&3 BHK FLATS FOR SALE at POTHINAMALLAYYAPALEM
1200, 1435, 2070 Sfts.
ALL FACINGS AVAILABLE
SAHASRA GROUP
Cont : 70364 52817
98856 52909, 91546 41379

■ Ultra Luxury Ready to Occupy 3 BHK Flats for Re Sale at RK Beach, Beach facing project beside Novotel Hotel. Contact No: 96668 89093. 90524 10253. [H-783376]

HOUSE FOR SALE
■ indp 2BHK 1200SFT, House in 267 Sq.yd -VUDA HIG on 2 Road corner 1 Km to BRTS road. Chinnamusiriwada. 99891 98444 [SCA-25004167]
■ Group House for sale 252 Sqy. G + 3, 6 Flats (Two Bedroom), East Face, 60Ft. Road. @ Kurmannapalem. Ph : 83746 58385 [V- 7000]
■ అనకాపల్లి-తాళ్ళపాలెం హైవే ఫేసింగ్ VMRDA Approved లే అవుట్ నందు కేవలం 40 లక్షలకే 267 గజాల్లో 1000 Sft. ఇండివిడ్యువల్ హౌస్. త్వరపడండి. ఫోన్ : 73965 75914, 83676 48991 [V- 13852]

LAND FOR SALE
■ Two and One Acres Agriculture Land For Sale Near At Chodavaram. Contact Ph: 98850 74852 [HA-15906]

PLOT FOR SALE
■ 333 Sq.yds. (60x50) VUDA Approved Plot for sale. L.P.No. 9372/08/L4. West : 40 Ft. North : 20 Ft. Road. Madhavadhara Vuda Colony. Ph: 81064 91222, 96661 11543 [V- 2807]
■ కొత్తవలస రైల్వేస్టేషన్‌కు 1KM దూరంలో మంగళపాలెంలో ఇండ్లకు అనుకొని ఉన్నవి. 111, 222, 200 మరియు 15 సెంట్ల స్థలాలు రెడీగా ఇల్లు కట్టుకొనుటకు ఉన్నవి. ఫోన్ : 89199 94026 [V- 2813]
■ కూర్మన్నపాలెం దువ్వాడ స్టేషన్ రోడ్‌లో 100 అడుగుల రోడ్‌ను ఆనుకుని 578 చ॥గ॥, 444 చ॥గ॥ల N/F, VUDA ప్లాట్ అమ్మకానికి కలదు. Beside ఆరెంజ్ స్వీట్స్. ఫోన్ : 98492 53383, 98493 44683 [V- 13850]
■ 330 sq.yards plot with 6 feet width passage for sale in Jawahar St, Opp. CMR Jewellery Mall, Kakinada No. Brokers. 99495 07969 [SCA-25004320]

TOLET
■ To-Let for OFFICE SPACE First floor 400+250 sft, Second Floor 600 sft Highway Facing Gurudwara, Vizag. Ph: 9676767788. [SCA-25003174]

Services

BUSINESS OFFER
■ ప్రైవేట్ స్కూల్స్‌లో మేము చేస్తున్న ప్రోగ్రాంల్లో పెట్టుబడి పెట్టి మంచి లాభాలను పొందండి. ఫోన్ : 93917 17772 [V- 2894]

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13756]

INTERIORS
■ 2 BHK ఇంటీరియల్ వర్క్, కేవలం 1,99,000/- నుంచి ప్రారంభం. "AC Free" గా పొందే అవకాశం కోసం వెంటనే Call చేయండి. ఫోన్ : 90636 55738 [V- 6735]

OLD AGE HOME
■ Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్ : 87904 49799, 90108 92178 [SCA25004259]
■ విశాఖ లైఫ్ కేర్ : సీతమ్మధార డాక్టర్స్ కాలనీలో వృద్ధులకు, మంచాన ఉన్నవారికి ఆధునిక వసతులతో పాటు భోజన, డాక్టర్స్, నర్స్, ఆయా సదుపాయం, మీ ఇంటివద్దకే మా సేవలు. ఫోన్ : 98482 99968, 88975 76889 [V- 12483]

Wanted
■ LIC ఏజెంట్ / మహిళా కెరీర్ ఏజెంట్‌గా చేరండి. మహిళలకు నెలకు 7000/- & జెంట్స్‌కు 6000/- మరియు ఆకర్షణీయమైన కమిషన్ పొందండి. వాలంటీర్స్ చేరవచ్చు. వివరాలకు 98480 17499. [V- 2795]

■ WANTED TEACHER. Higher Classes : Maths, Social, Physical Science & Telugu. Springdales School, New Gajuwaka. Ph : 98481 99867 [SCA25004250]
■ సిరిపురం గిఫ్ట్ అండ్ గ్రీటింగ్ షాపులో & జూస్ షాపులో పనిచేయుటకు ఇద్దరు అమ్మాయిలు కావలెను. జీతం : 8 వేలు నుండి 12 వేలు వరకు. ఫోన్ : 91547 08090, 91774 91548 [SCA25004447]
■ పాయకరావుపేట నియోజకవర్గంలో సర్వే చేయుటకు Field Agents స్త్రీ, పు॥ అభ్యర్థులు కావలెను. అర్హత : Inter, Bike, Smart Phone. ఫోన్ : 97032 57045 [V- 2816]
■ విశాఖపట్నం నందు హోటల్‌లో పనిచేయుటకు రిసెప్షనిస్ట్, హౌస్‌కీపింగ్, బెల్ బాయ్స్, స్టాఫ్ కావలెను. ఫోన్ : 92462 34599 [V- 0086]
■ ప్రముఖ స్టీల్ కంపెనీలో మార్కెటింగ్ విధులు నిర్వహించుటకు (Male / Female) అభ్యర్థులు కావలెను. టూవీలర్ ఉన్నవారికి ప్రాధాన్యత. సెల్ : 8121213311, 9010559955. steelbuddy144@gmail.com [SCA-25004400]
■ Wanted 5th & 6th Maths, Teacher, Wonworld School, 4-47-7, Lawsonsbay Colony, Pedawaltair, VSP. Ph : 98482 37187, 82351 23123 [V- 13882]
■ అన్‌లోడర్స్ పురుషులు కావలెను. 8గం॥డ్యూటి Age: 25-45 years, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ తప్పనిసరి. మంచి జీతం +ESI+EPF కలవు. ✆ 91000 28528, 73961 28206 [G-27]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!! సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-16.
అద్దెకు • అమ్మకం • రియల్ ఎస్టేట్ • ఫర్నీచర్స్ • ఆటోమొబైల్స్ • కంప్యూటర్స్ • సర్వీసెస్ • కావలెను
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

చదువుతోపాటు ఆరోగ్యం ముఖ్యం



మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి జగన్నాథం

కోటవురట్ల: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం కోరారు. మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. శిబిరానికి విద్యార్థులు రావడం వల్ల ఎన్నో విజ్ఞానదాయకమైన విషయాలను తెలుసుకోవచ్చన్నారు. పిల్లలు చదువుతోపాటు ఆటలు ఆడటం, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు.

భూ సమస్యలపై విచారణ



అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న అధికారులు

కోటవురట్ల: మండల ప్రత్యేక అధికారి సుభాషిణి అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదిదారుల నుంచి భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలను పరిశీలించారు. ఇరువర్గాల వారిని విచారించారు. ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి. సత్యనారాయణ, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామి అలంకరణ



కోటవురట్ల: జ్యేష్ఠ మాసం మొదటి శనివారం పురస్కరించుకొని స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో స్వామివారిని పూలు, తులసీ మాలలతోపాటు వజ్ర కవచాలంకృతులతో అందంగా అలంకరించి పూజలు చేశారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. భక్తులు ఎక్కువగా దర్శించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

గురుకులం ప్రిన్సిపాల్‌గా విక్టర్‌పాల్



బాధ్యతలు స్వీకరించిన విక్టర్‌పాల్

దేవరాపల్లి: తెనుగుపూడి డా. బీఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయం రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా ఎస్. విక్టర్‌పాల్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌గా పని చేసిన పి. రఘు వేరే చోటుకు బదిలీ కావడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పదోన్నతిపై గ్రేడ్-2 ప్రిన్సిపాల్‌గా ఎస్. విక్టర్‌పాల్ స్థానిక గురుకుల విద్యాలయంలో విధుల్లో చేరారు. ఆయనకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో విక్టర్‌పాల్ ఇదే గురుకులంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పని చేశారు.

అనకాపల్లి సినిమాలు

భైరవం	:రాజా
ఖలేజా	:సత్యనారాయణస్క్రీన్-1
కరాటే కిడ్-లిజెండ్స్	: సత్యనారాయణ స్క్రీన్-2
ఖలేజా	:పర్తిసాయి
సింగిల్	:షిర్డీసాయి
ఏసీఈ	:వెంకటేశ్వర
శుభం	:శ్రీసత్య
షష్టిపూర్తి	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-10, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 392 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

సంక్షేమం.. ఎగనామం

కూటమి అధికారంలోకి వచ్చి అప్పుడే ఏడాది పాలన పూర్తయింది. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటైనా పూర్తిగా అమలు చేశారంటే అదీ లేదు. ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని నమ్మించి ఒకసారి రాయితీ సొమ్ముతో చేతులు దులుపుకున్నారు. మిగతా పథకాలు అమలు కోసం ఏడాదిగా సర్వేలు పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఇప్పుడు ప్రజల దృష్టి మళ్లించేందుకు యోగాంధ్ర జపం చేయిస్తున్నారు.

- ఏడాదిగా పథకాల అమలు ఊసేలేదు
- వివిధ రకాల సర్వేలతో కాలయాపన
- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కూటమి ప్రభుత్వం
- ఇప్పుడు యోగాంధ్ర జపం
- ప్రభుత్వ ఉద్యోగులకు తిప్పలు



గాంధీనగరం ఎస్ఆర్ శంకరన్ హాల్లో యోగాసనాలు చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో యోగాసనాలు చేస్తున్న పోలీసులు

అనకాపల్లి: సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేయకుండా సర్వేలతో ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల నుంచే అధికార యంత్రాంగాన్ని ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారు. యోగాంధ్ర-2025 సర్వే పేరుతో సిబ్బందిని ప్రజల ఇళ్ల చుట్టూ తిప్పుతున్నారు.

నిలిచిన ప్రజలకు సేవలు..

కొద్ది రోజులుగా ఉద్యోగులకు యోగాంధ్ర-2025 సర్వే తప్ప ప్రజల పనులేమి జరగడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు టార్గెట్లు ఇచ్చి మరీ యోగా సర్వేలు చేయిస్తున్నారు. యోగాను ప్రతి ఒక్కరి జీవితంలో భాగం చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రచారార్భాటంతో ముందుకు సాగుతూ అధికారులను, సిబ్బందిని ఒత్తిడికి గురిచేస్తున్నారు. లక్ష్యాలు సాధించేందుకు రాత్రి 8 గంటల వరకూ టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తుండటంతో క్షేత్రస్థాయిలోని ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. మరో పక్క ప్రభుత్వ ఉద్యోగులు బదిలీలు జరుగుతున్నాయి. ఇటు బదిలీలు, అటు యోగాంధ్ర సర్వేలతో ప్రజలు, అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల పనులు నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు యోగాంధ్రపైన అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో ఇతర పనులు ఏమి ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. లక్ష్యాన్ని నిర్దేశించి దానిని పూర్తి చేయాలంటూ దిగువ స్థాయి సిబ్బందిపై రోజుకు అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. యోగా డే రోజున యోగా చేయించడానికిగాను యోగా గురువులు, యోగా మాస్టర్స్ ట్రైనర్స్, యోగా ట్రైనర్స్‌ను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఉదయం నుంచి యోగా సర్వేలు....

అనకాపల్లి పట్టణంతోపాటు మండలంలోని సచివాలయాల్లో పనిచేసే వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ సహాయకులు, ఏఎన్ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది ఉదయం ఆరు గంటల నుంచి యోగాంధ్ర - 2025 సర్వే నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా రోజూ పట్టణ, మండలంలో 53 సచివాలయాల సిబ్బంది ప్రజల వద్దకు వెళ్లి యోగాంధ్రపై అవగాహన కల్పిస్తున్నారు. దీనిపై ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ నెల 21న విశాఖలో యోగాంధ్ర-2025 కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కానున్నారు. దీనికి ఎలాగైనా తరలించేందుకు మభ్యపెడుతున్నారు.

- పట్టణ, మండల పరిధిలో సచివాలయ ఉద్యోగులకు గాంధీనగరం ఎస్ఆర్ శంకరం హాల్లో రోజూ సాయంత్రం యోగా శిక్షణ ఇస్తున్నారు.
- పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ కార్యాలయాలు, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఈ నెల 21వ తేదీ వరకూ యోగా వేడుకలు నిర్వహిస్తున్నారు.
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కాయకష్టాన్ని నమ్ముకుని బతుకుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు యోగాపై సచివాలయ ఉద్యోగులు నిత్యం శిక్షణ ఇస్తున్నారు.
- కూటమి ఏడాది పాలనలో ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా సచివాలయాల ఉద్యోగులను సర్వేలకు పరిమితం చేశారు.

యోగా సర్వేలు చేస్తున్నాం

కరోన తర్వాత ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. యోగా చేయడం వల్ల ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించవచ్చు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు యోగాంధ్ర సర్వేలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజలు స్వచ్ఛందంగా యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. లక్ష్యాన్ని పూర్తి చేసి రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానం సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– కె.లావణ్య, ఆయుష్మాన్ భారత్ విభాగం జిల్లా వైద్యురాలు, అనకాపల్లి

కుమార్‌రాజాకు ఘన సత్కారం



కుమార్‌రాజాను గజమాలతో సత్కరిస్తున్న ధర్మశ్రీ, ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు

అనకాపల్లి: స్థానిక రింగ్ రోడ్డులోని నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నియమితులైన మలసాల కుమార్‌రాజాను శనివారం ఘనంగా సన్మానించారు. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి, పార్లమెంట్ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజు, కంబాల జోగులు శాలువాలు, గజమాలలతో ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అరకు నియోజకవర్గ పార్లమెంటు పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు సేవించడం వల్ల క్యాన్సర్



క్యాన్సర్‌పై వాకర్స్‌కు వివరిస్తున్న వైద్యుడు నాయుడు

అనకాపల్లి: పొగాకు సేవించడం వల్ల క్యాన్సర్ బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ వాకర్స్ గౌరవాధ్యక్షుడు, వైద్యుడు డి.డి.నాయుడు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ వాకర్స్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఆయన మాట్లాడారు. 1987లో దేశంలో 26 కోట్ల జనాభాకు ధూమపానం వల్ల ఆరోగ్యం పాడైపోయిందన్నారు. ఖైనీ, గుట్కా, పాన్ మసాలా, సిగరెట్టు, బీడీ, చుట్ట, హానికరమైన రసాయనాలు ప్రధానంగా నికోటిన్ హైడ్రోజన్ సైనేడ్ టార్, ఆర్సినిక్కా, కార్బన్ మోనాక్సైడ్ తీసుకున్న వారిలో క్యాన్సర్ వస్తుందన్నారు. పొగాకు తాగడం వల్ల వ్యక్తిగతంగా, ఆరోగ్యపరంగా, ఆర్థికంగా నష్టపోతారన్నారు. పొగాకు సేవించిన వ్యక్తుల్లో ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్, జీర్ణాశయంలో క్యాన్సరు, ప్యాంక్రియాటిక్ క్యాన్సరు, గర్భసంచి క్యాన్సరు, గుండె జబ్బులు బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లా ఎన్టీఆర్ ఆస్పత్రిలో ధూమపాన డి ఎడిక్షన్ సెంటర్ ఉందన్నారు. ఎన్టీఆర్ మార్కెట్ వాకర్స్ అధ్యక్షుడు ఎస్.ఎఫ్.ఐ. సత్యనారాయణ, అనకాపల్లి వాకర్స్ కార్యదర్శి యల్లపు శివ, సభ్యులు కాండ్రేగుల వెంకట జగ్గారావు, శిలపరశెట్టి భాస్కర్, దిలీప్‌కుమార్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగులో వ్యవసాయ పద్ధతులపై అవగాహన



డ్రోన్ల ద్వారా మందుల పిచికారీ గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

సబ్బవరం: రైతులు తొలకరిలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను, కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు రైతులకు వివరించారు. మండలంలోని నారపాడు, అమృతపురం గ్రామాల్లో భారతీయ వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వీక్షిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

భూసార పరీక్షల విశిష్టతను వివరించారు. ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. జిల్లా నోడల్ ఆఫీసర్, కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎం. రాజ్ కుమార్ మాట్లాడుతూ రైతులు పురుగులు, తెగుళ్ల నివారణలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎ. సౌజన్య మాట్లాడుతూ వరి పంటలో సాగుచేసే నూతన రకాలైన ఎంటీయూ-1224, ఎంటీయూ-1262, బీపీటీ-2295, బీపీటీ-2846, ఎంటీయూ-1318 రకాల స్వభావం గురించి వివరించారు.ఈ కార్యక్రమానికి భారతీయ వ్యవసాయ పరిశోధన మండలం నుండి నామినేట్ అయిన డాక్టర్ ఎం. వెంకటేశం, టి. కిరణ్ ఎరువుల యాజమాన్యం, పంటల దిగుబడికి చేపట్టాల్సిన చర్యలను వివరించా రు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కొండెంపూడి శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం. సత్తిబాబు, డాక్టర్ ఎ. సౌజన్య, డాక్టర్ కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల సంచారంతో బెంబేలు



అగ్రహారంలో సంచరిస్తున్న ఊర కుక్కలు

కోటవురట్ల: స్థానిక అగ్రహారం వీధిలో ఊర కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దారిన పోయే సమయంలో కుక్కలు ఒక్కొక్కసారి కరుస్తుండటం వల్ల అనారోగ్యపాలు కావలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గవరపేట, సంతబయల, మేదరవీధి తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉందని వాపోతున్నారు. వీటి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

96.46 శాతం పింఛన్ల పంపిణీ

కోటవురట్ల: మండలంలో 96.46 శాతం మేర ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో వి.వి. రవికుమార్ శనివారం తెలిపారు. మండలంలో 10,161 సామాజిక పింఛన్లు ఉండగా, వాటిలో 9,639 మందికి పింఛన్లు పంపిణీ చేశామన్నారు. ఇంకా 522 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

రేషన్ డిపో ఏర్పాటుకు డిమాండ్



టిడ్కో కాలనీలో ఆందోళన చేస్తున్న స్థానికులు

పరవాడ: టిడ్కో కాలనీ వాసులకు అందుబాటులో ఉండేవిధంగా రేషన్ డిపో ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. టిడ్కో కాలనీలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యంలో కాలనీవాసులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఐద్వా కార్యకర్తలు మాట్లాడుతూ కాలనీ వాసులకు స్థానికంగా రేషన్ డిపో ఏర్పాటు చేసి 14 రకాల నిత్యావసర సరుకులు అందజేయాలని డిమాండ్ చేశారు. దూర ప్రాంతంలో ఉన్న రేషన్ డిపోలకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవడం తలకు మించిన భారమవుతుందన్నారు. ప్రస్తుతం కొనసాగిస్తున్న ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల పంపిణీని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో మన్యాల బంగారమ్మ, తుంపాల అన్నపూర్ణ, ఎం. సంతోష్‌కుమారి, మంగ, కనకమహాలక్ష్మి, బేగం, ఎస్. గంగాభవానీ, లావణ్య, రమ, లక్ష్మి, సీత, రమణమ్మ, గోపాలరావు, పారు, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాధాకృష్ణుల తీర్థం

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం దబ్బకుంటు రహదారిలో గల శ్రీ రాధాకృష్ణుల తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి భారీ స్థాయిలో అన్నసమారాధన జరిపారు. సాంస్కృతిక కార్యక్రమం ప్రదర్శించారు.

అహల్యాబాయి హోల్కర్ సేవలు ఎనలేనివి



అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అనకాపల్లి టౌన్: బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో అహల్యాబాయి హోల్కర్ జయంతి నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగమణి మాట్లాడుతూ అహల్యాబాయి హోల్కర్ అనేక హిందూ దేవాలయాలను పునర్నిర్మాణం చేయడం ద్వారా సేవ, ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మికతకు కృషి చేశారని, దీన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆమె పేరిట స్త్రీశక్తి పురస్కారాన్ని నెలకొల్పిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. కొండబాబు, ఉపాధ్యక్షుడు జి. స్వరూప్, మండల అధ్యక్షుడు కె. సన్యాసిరావు, ఎ. అప్పారావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న ఆర్డీవో షేక్ అయిషా



యోగాసనాలు చేస్తున్న విశ్రాంత సైనికులు

అనకాపల్లి: రోజూ యోగా చెయ్యడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని ఆర్డీవో షేక్ అయిషా తెలిపారు. స్థానిక గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర -2025 కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిత్యం యోగా చేయడం వల్ల శరీర దృఢత్వానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం యోగా గురువులు మంగియ్య, బి. అప్పారావుల పర్యవేక్షణలో యోగాసనాలు చేశారు. రెవెన్యూ సిబ్బంది, విశ్రాంత సైనికులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కృష్ణారావు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు, తహసీల్దార్ బి. విజయకుమార్ తదితరులు పాల్గన్నారు.

ఉపాధి హామీ కూలీల బకాయి వేతనాలు చెల్లించాలి



బకాయి వేతనాల కోసం ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

పరవాడ: ఉపాధిహామీ కార్మికులకు చెల్లించాల్సిన 8 వారాల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పరవాడలో చేపట్టిన ఉపాధి హామీ పని ప్రదేశంలో శనివారం ఉపాధి కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు 8 వారాల నుంచి బకాయి వేతనాలు అందక అర్థాకలితో అలమటిస్తున్నారన్నారు. ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు మంచినీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. పార, తట్ట, గునపాం వంటి సామగ్రికి డబ్బులు చెల్లించాలన్నారు. వేసవి వేతనం కలిపి 40 శాతం అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకి రూ.600 వేతనంగా చెల్లించాలన్నారు. ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని గనిశెట్టి హెచ్చరించారు.

గాలి వీచినా...చినుకు పడినా చీకటే!

అప్రకటిత విద్యుత్తు కోతలతో అల్లాడుతున్న ప్రజలు



పట్టణంలో విద్యుత్ సబ్ స్టేషన్

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీలో ఇటీవల అప్రకటిత విద్యుత్తు కోతలు అమలవుతున్నాయి. మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కోసం 2,3 గంటలు సరఫరా నిలుపుతామని ప్రకటించి ఆరేడు గంటలు ఏకధాటిగా తీసేస్తున్నారు. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ఉష్ణోగ్రతల ప్రభావంతో ఉక్కపోత ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు కరెంటు కోతలు విధించి ప్రజలను మరింత అసహనానికి గురిచేస్తున్నారు. ఈదురు గాలులు వీచినా, వర్షం పడినా కరెంటు నిలిపివేస్తున్నారు. తిరిగి పునరుద్ధరణకు ఎన్ని గంటలు పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. శుక్రవారం ఈదురు గాలులతో కురిసిన వర్షం కారణంగా మధ్యాహ్నం నుంచి రాత్రి 8 గంటల వరకు పట్టణంలో విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. వ్యాపారులు, గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో వర్షం పడితే పట్టణంలో ఎప్పుడు కరెంటు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు దృష్టికి తీసుకువెళ్లగా రోజూ గాలులు వీస్తున్నాయి.. ఈ కారణంగా తప్ప, అప్రకటిత కోతలకు అవకాశం లేదన్నారు.

చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విష్ణు స్వరూప్, సీఐ మల్లికార్జునరావు

పరవాడ: పట్టపగలు చోరీలకు పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్ వెల్లడించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా గరివిడి మండలం కాపుసంభవం గ్రామానికి చెందిన ముగిడి రాంబాబు (30) అగనంపూడిలో నివాసం ఉంటున్నాడు. నిందితుడు గత కొంత కాలం నుంచి దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్నాడు. గొర్లివానిపాలెం, మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీల్లో పగటి పూట 7 దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. పనులకు వెళ్లే కూలీలు, ఉద్యోగుల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలు, నగదు దోచుకునేవాడు. మంత్రిపాలెం, పరవాడ గ్రామాల్లో జరిగిన చోరీలను పరిశీలించగా ఈ నేరాలకు పాల్పడింది ఒకరేనని పోలీసులు నిర్ధారించుకున్నారు. నేరాలకు పాల్పడిన రాంబాబును మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ కాలనీలో శనివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ విచారణలో 7 దొంగతనాలకు పాల్పడింది తానేనని నిందుతుడు ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ ఏడు చోరీల్లో 13 తులాల బంగారు ఆభరణాలు, 62 తులాల వెండి ఆభరణాలు, రూ.2,26,500 నగదు దొంగిలించాడు. నిందుతుడి నుంచి 10.5 తులాల బంగారు ఆభరణాలు, 39 తులాల వెండి వస్తువులు, రూ.1.30 లక్షల నగదును స్వాధీనం చేసుకుని నిందుతుడిని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ విష్ణు స్వరూప్ వెల్లడించారు. దొంగతనాల విషయంలో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని సూచించారు. ఈ కేసులను ఛేదించిన పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, క్రైం హెడ్ కానిస్టేబుల్ ఎస్.వి. సాయి సంతోష్, శ్రీనివాస్, జి.వి.వి.ఎస్. నాయుడు, ఎస్.నాగేంద్రబాబు, పోలీసు సిబ్బందిని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, క్రైం అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు, డీఎస్పీ విష్ణు స్వరూప్ అభినందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com